క్లుప్తంగా

విద్యా సామర్థ్యాన్ని పెంచాలి ..



చాకివలసలో ర్యాలీ నిర్వహిస్తున్న బాలికలు

భోగాపురం: నేటి బాలికల్లో విద్యా సామర్థ్యాన్ని పెంపొందించడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మహిళా, శిశు సంక్షేమ శాఖ పీఓ ఎస్తేరురాణి తెలిపారు. మండలంలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో శుక్రవారం జాతీయ బాలికల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా భోగాపురం, సవరవిల్లి, చాకివలస, పోలిపల్లి, తదితర అంగన్‌వాడీ కేంద్రాల అవరణలో ర్యాలీలు చేపట్టారు.

వెండి వస్తువుల బహూకరణ



వెండివస్తువుల అలంకరణలో సంతోషిమాత అమ్మవారు

నెల్లిమర్ల: నగర పంచాయతీ పరిధిలోని జరజాపుపేట సంతోషినగర్‌లో కొలువైన సంతోషి మాతకు జరజాపుపేట గ్రామానికి చెందిన గుండోజీ శంకర్, లక్ష్మి దంపతులు రూ.1.25 లక్షల విలువ చేసే వెండి కిరీటం, అభయహస్తం, వెండి కుంకుమ భరిణి, జడపాయ, పట్టుచీర శుక్రవారం బహూకరించారు. కార్యక్రమంలో నగర పంచాయతీ వైస్ చైర్మన్ సముద్రపు రామారావు, కడలి ప్రకాశరావు పాల్గొన్నారు.

పశువులు తరలిస్తున్న వాహనాల పట్టివేత



పట్టుబడిన వ్యాన్‌లో ఉన్న పశువులు

నెల్లిమర్ల : నెల్లిమర్ల పట్టణ పరిధిలో అక్రమంగా పశువులు తరలిస్తున్న రెండు వాహనాలను స్థానిక పోలీసులు శుక్రవారం పట్టుకున్నారు. రాజాం నుంచి నెల్లిమర్ల మీదుగా విజయనగరం వైపు వెళ్తున్న వాహనాలను ఎస్సై గణేష్, సిబ్బంది సీజ్ చేశారు. వాహనాల్లోని పశువులను గుర్ల గోశాలకు అప్పగించారు. వాహన చోదకులపై కేసు నమోదు చేశారు. అనుమతి లేకుండా పశువులను తరలిస్తే చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా ఎస్సై హెచ్చరించారు.

సిరిమాను సేవలో..

- మాను తయారీలో వడ్రంగుల స్వచ్ఛంద సేవ
- ఏళ్ల తరబడిగా వస్తున్న ఆనవాయితీ
- అమ్మవారు చూపిన బాటలోనే..
- వడ్రంగులతో పాటు పోలీస్, ఫారెస్ట్, మున్సిపల్ సిబ్బంది సేవలు



సిరిమాను చెక్కుతున్న వడ్రంగులు

విజయనగరం టౌన్: కోరిన కోర్కెలను తీర్చే కల్పతరువు పైడితల్లి అమ్మవారి జాతరలో సిరిమానోత్సవం ఓ అద్భుతమైన అపురూప ఘట్టం. ఏళ్ల తరబడి నిర్విఘ్నంగా సాగుతున్న సిరిమానోత్సవానికి ఎంతో ప్రాధాన్యం ఉంది. సిరిమాను చెట్టును గుర్తించినప్పటి నుంచి తయారు చేయడం వరకు ఎందరో వడ్రంగుల భాగస్వామ్యం ఉంటుంది. ఏ పనులున్నా... ఎక్కడున్నా.... ఏటా సిరిమానోత్సవానికల్లా వారంతా పట్టణానికి చేరుకుంటారు. భక్తిశ్రద్ధలతో సిరిమానును హుకుంపేటలో పూజారి ఇంటి వద్ద తయారుచేస్తారు. ఈ ఏడాది కూడా వీరి చేతుల్లో ఊపిరి పోసుకుంటున్న సిరిమాను, గిలక, పీటల తయారీ దాదాపు పూర్తి కావొచ్చింది. సిరిమాను తయారీలో వడ్రంగులతో పాటు పోలీస్, ఫారెస్ట్, మున్సిపల్ అధికారుల పాత్ర ఉంటుంది.

అమ్మవారే చూపిస్తుంది..

సిరిమాను తయారీకి చింతమానునే ప్రధానంగా పైడితల్లి కోరుకుంటుంది. ఏటా అమ్మవారు పూజారి కలలో కనిపించి సిరిమానుకు దారి చూపించడం ఆనవాయితీగా వస్తోంది. ఆ దిశలో పూజారి, ఆలయ సిబ్బంది వెళ్లి అన్వేషిస్తారు. అమ్మ చూపిన బాటలో ఉన్న చింతచెట్టును సిరిమానుగా నిర్ణయించి అమ్మవారికి పూజాధికాలను నిర్వహిస్తారు. ఇదిలా ఉంటే సిరిమాను సాక్షాత్కరించిన గ్రామంలో పండగ వాతావరణం నెలకొంటుంది. పైడితల్లి తమ గ్రామానికి వచ్చిందని గ్రామస్తులు ఉప్పొంగిపోతారు. భాజాభజంత్రీలతో గ్రామోత్సవం నిర్వహిస్తారు. సుమారు పది వేల మందికి పైగా భోజన సదుపాయాలు ఏర్పాటు చేస్తారు. ఈ ఏడాది పెదతాడివాడ గ్రామంలోని మజ్జివారి కల్లాల్లో చెట్టును గుర్తించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం చెట్టును నరికి హుకుంపేటలోని పూజారి ఇంటి వద్దకు తరలించారు. సిరిమాను తయారీలో కొన్ని కుటుంబాలకు చెందిన వడ్రంగులు ఎటువంటి ప్రతిఫలం ఆశించకుండా స్వచ్ఛందంగా పాల్గొంటున్నారు. సిరిమాను, గిలకలు, పూజారి పీట, ఇరుసు మాను, రథాలను తయారుచేసి వాటికి రంగులు అద్దడంలో తలమునకలయ్యారు.



శరవేగంగా తయారవుతున్న ఇరుసు మాను, పీటల తయారీ

మా అదృష్టం..



పైడితల్లి అమ్మవారి సిరిమాను వద్ద విధులు నిర్వహించడం మా పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నాను. ఎంతో పుణ్యం చేసుకుంటే గానీ ఇటువంటి అదృష్టం కలగదన్నది వాస్తవం. ఫారెస్ట్ శాఖ పరంగా తాము నిర్వహించాల్సిన బాధ్యతను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నాను. చాలా ఆనందంగా ఉంది.

– డి.సూర్యనారాయణ, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్

అమ్మ ఆశీస్సులతోనే...



పైడితల్లి అమ్మవారి ఆశీస్సులతోనే ప్రతి ఏటా విధులు నిర్వహించేందుకు క్రమం తప్పకుండా ఇక్కడకు వస్తాను. ఈ ఏడాది అవకాశం లభించింది. షిఫ్ట్‌ల వారీగా విధులు నిర్వహిస్తున్నాం. సిరిమాను ప్రక్రియ పూర్తయ్యే వరకూ జాగ్రత్తగా బాధ్యతలు చేపడతాం. అమ్మవారి ఆశీస్సులతో మరింత మెరుగైన సేవలందించేందుకు సిద్ధంగా ఉన్నాం.

– ఎ.శ్రీదేవి, ఉమెన్ పీసీ, టూటౌన్ పీఎస్, విజయనగరం

అందరి సమష్టి కృషి..



పైడితల్లి జాతర నిర్వహణకు ఎంతో కష్టపడతాం. రాత్రనక, పగలనక పనుల్లో నిమగ్నమవుతాం. వడ్రంగులు సమష్టి కృషితోనే ఇది విజయవంతమవుతుంది. హుకుంపేటలో నెల రోజులు పండగ వాతావరణం ఉంటుంది. సిరిమాను తయారీలో భాగస్వామిని కావడం నా అదృష్టం.

– కనిమెళ్ల రమణ, పాతర్లపల్లి, రణస్థలం, శ్రీకాకుళం జిల్లా

తాతల నుంచి భాగస్వామ్యం ..



చిన్నప్పటి నుంచి మానాన్నతో కలిసి సిరిమాను చెక్కడానికి వచ్చేవాడిని. ఎంతో పవిత్రమైన చింతమానును చెక్కుతుంటే చెప్పలేనంత ఆనందం కలిగేది. మా తాత తర్వాత నాన్న... ఇప్పుడు నేను సిరిమాను చెక్కుతున్నా. ఆ తల్లి దయతో నా కుటుంబం ఎంతో ఆనందంగా ఉంది.

– మీసాల అచ్చెంనాయుడు, విజయనగరం

పనులు దాదాపు పూర్తి..



ఎంతో కష్టపడి తల్లి కోసం చెక్కే సిరిమానుపై అమ్మవారు ఆశీనులై ఆకాశవీధిలో విహరిస్తూ దీవెనలందించడం మాకెంతో ఆనందం. ఒక్కొక్క రథం వెళ్తుంటే అప్పటి వరకూ పడిన కష్టమంతా మరిచిపోతాం. కష్టం మరచి, ఎంతో ఉత్సాహంగా పండగ చేసుకుంటాం. పనులు దాదాపు పూర్తయిపోయాయి.

– చిట్టూరి గోవింద, విజయనగరం

భక్తిప్రపత్తులతో తయారీ..



సిరిమాను సహా గిలకలు, పూజారి కూర్చొనే పీటను తయారుచేస్తాం. పెద్ద పెద్ద తాళ్లతో కట్లు కడతాం. రోజూ స్నానపానాదులు పూర్తి చేసుకుని భక్తితో సిరిమానుకు మొక్కి బొట్టు పెట్టాకే పనులు ప్రారంభిస్తాం. ప్రస్తుతానికి పనులు దాదాపు పూర్తి కావొచ్చాయి.

– ఎస్.వెంకటేశ్వరరావు, సారిక

ఎన్ని పనులున్నా రావాల్సిందే..



అమ్మసేవలో పాతికేళ్లుగా తరిస్తున్నాను. ఎక్కడ ఉన్నా తల్లి పండగకు రావాల్సిందే. సిరిమాను పనులు చేయాల్సిందే. అందుకే ఏ ఊరికి పనులకెళ్లినా పండగ సమయానికి ఊరొచ్చి వారం రోజుల పాటూ సిరిమాను తయారీలో పాల్గొంటాను. భోజన, వసతి సదుపాయాలు నిర్వహకులు ఏర్పాటు చేస్తారు.

– టి.శంకరరావు, సారిక

ఓం దుర్గా నమోస్తుతే..

- విజయదశమి పురస్కరించుకుని వాడవాడలా ప్రత్యేక పూజలు
- వనంగుడిలో శనివారం సాయంత్రం జమ్మి ఉత్సవం

విజయనగరం టౌన్: విజయదశమి పర్వదినం పురస్కరించుకుని శనివారం వేకువ జామునుంచే అమ్మవారికి విశేష పూజలు నిర్వహించనున్నారు. స్థానిక రైల్వేస్టేషన్ వద్దనున్న వనంగుడిలో కొలువైన దుర్గాదేవి రాజరాజేశ్వరి అమ్మవారిగా భక్తులకు దర్శనమిస్తారు. ఆలయ ఆవరణలో ఉన్న జమ్మి చెట్టు వద్ద శనివారం సాయంత్రం ప్రత్యేక పూజలతో పాటు జమ్మి ఉత్సవాన్ని వేదపండితులు శాస్త్రోక్తంగా నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆలయ ఈఓ డీవీవీ ప్రసాదరావు శుక్రవారం మాట్లాడుతూ.. విజయదశమి పర్వదినం పురస్కరించుకుని పైడితల్లి అమ్మవారికి ప్రత్యేక పూజలతో పాటు ఆలయంలో కొలువైన దుర్గాదేవికి శ్రీచక్ర కుంకుమార్చనలు నిర్వహిస్తున్నామన్నారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించి, తరించాలని కోరారు. అదే విధంగా స్థానిక జ్ఞాన సరస్వతీదేవిని భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు.



మహిషాసురమర్దినిగా దుర్గాదేవి

ఆకట్టుకున్న దుర్గాదేవి చిత్రరూపం

శరన్నవరాత్రి మహోత్సవాలను పురస్కరించుకుని పట్టణానికి చెందిన ప్రముఖ చిత్రకారిణి, లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్ హోల్డర్ సిరిపురపు ప్రవల్లిక నారాయణ్ దుర్గాదేవి చిత్రం వేసింది. ఈ సందర్భంగా ఆమెను పలువురు అభినందించారు.



ప్రవల్లిక గీచిన దుర్గాదేవి చిత్రరూపం

మహిషాసురమర్దినిగా...

విజయనగరం టౌన్: రైల్వేస్టేషన్ వద్దనున్న పైడితల్లి అమ్మవారి వనంగుడిలో కొలువైన దుర్గాదేవి శుక్రవారం మహిషాసురమర్దినిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ వేదపండితులు వెలువలపల్లి నరసింహమూర్తి, సాయిలు శాస్త్రోక్తంగా పూజాధికాలు చేశారు. అమ్మవారికి శ్రీచక్ర కుంకుమార్చనలు నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించి, తరించారు.

భక్తిశ్రద్ధలతో సామూహిక కుంకుమార్చనలు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని కొత్తపేటలో మారుతీ యువజన సంఘం ఆధ్వర్యంలో దుర్గా శరన్నవరాత్రి మహోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. శుక్రవారం సాయంత్రం దేవీ మండపం ఆవరణలో సామూహిక కుంకుమార్చనలు చేపట్టారు. అర్చకుడు రాంబాబు, గ్రామానికి చెందిన మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

• దుర్గమ్మకు సారె...

నెల్లిమర్ల మండలంలోని ఒమ్మి గ్రామంలో 150 కిలోల పసుపు కొమ్ములతో తయారు చేసిన దుర్గమ్మకు శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా తొమ్మిదో రోజు అమ్మవారు మహిషాసురమర్దిని అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా వివిధ రకాల పిండి వంటలతో ప్రత్యేకంగా తయారుచేసిన సారెను అమ్మవారికి భక్తిశ్రద్ధలతో సమర్పించారు. సుమారు వెయ్యి మంది భక్తులు గ్రామ పొలిమేరకు కలశాలతో ఊరేగింపుగా వెళ్లి, సారెను దుర్గమ్మ సన్నిధికి తీసుకువచ్చారు. అమ్మవారిని రాజరాజేశ్వరిగా అలంకరించి శనివారం నిమజ్జనం చేస్తామని కమిటీ సభ్యులు తెలిపారు.



– నెల్లిమర్ల రూరల్

ఐశ్వర్యలక్ష్మికి పంచామృతాభిషేకాలు



అమ్మవారికి పంచామృత స్నానం చేస్తున్న రుత్వికులు

విజయనగరం రూరల్: దసరా శరవన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా దుప్పాడ శ్రీక్షేత్రంలో కొలువై ఉన్న అష్టలక్ష్మీ సమేత ఐశ్వర్య వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ఐశ్వర్యలక్ష్మీకి శుక్రవారం పంచామృతాభిషేకాలు నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకుడు చామర్తి రమేష్ ఆధ్వర్యంలో జరిగిన పూజా కార్యక్రమాల్లో ధర్మకర్తలు దుర్గాబాలాజీ, ఉమాదేవి దంపతులు, భక్తులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

నా క్లయింటు అయిన శ్రీమతి సంక్రాన లక్ష్మి, భర్త. త్రినాథ్, డోర్ నెం.4-8-15/6, కొత్త అగ్రహారం, విజయనగరం జిల్లా వారు ఇచ్చిన భోగట్టాపై నేను బహిరంగ ప్రకటన ద్వారా తెలియజేయనది ఏమనగా.

నా క్లయింటు దస్తావేజు నెం.4050/2023 & 4049/2023 గల ఆస్తిని విజయనగరం (వెస్ట్) రిజిస్ట్రార్ ఆఫీసులో రిజిష్టర్ కాబడిన ఈ ఆస్తికి సంబంధించిన ఒరిజినల్ లింక్ డాక్యుమెంట్ నెం.3698/1994, విజయనగరం ఆర్.ఓ, తేది.10.10.1994 న రిజిష్టర్ కాబడిన ఆస్తిని సదరు వద్దివర్తి సత్య వెంకట నాగ వినాయక పంచముఖేశ్వర రావు వారి వద్ద నుండి పొందియున్నారు. సదరు ఒరిజినల్ లింక్ డాక్యుమెంట్ నెం.3698/1994 నా క్లయింట్ ఇంటి వద్ద నుండి గంట్యాడ ప్రయాణిస్తుండగా పోయినవి. దాని నిమిత్తం తేది.08.10.2024 న పోలీస్ కంప్లైంట్ ఇచ్చియున్నారు మరియు అవి తిరిగి దొరుకుటకు అవకాశం లేకుండా ఉండుట వలన ఈ ప్రకటన ఇవ్వదలచినది. కాగా సదరు ఆస్తి మీద నా క్లయింటుకి ఎటువంటి అభ్యంతరములు, తీర్మానములు, బాకీలులేవు.

షెడ్యూల్ ఆస్తి: విజయనగరం జిల్లా, పైడిమాంబ కాలనీ లే-అవుట్ నందు కనపాక శివారు, అయ్యన్నపేటలో సర్వే నెం.5/20 లో భాగం ప్లాట్ నెం.65 మొత్తం 266.66 చ.గజములకు సంబంధించిన ఆస్తికి హద్దులు : తూర్పు : ప్లాట్ నెం.66, దక్షిణం : ప్లాట్ నెం.70, పడమర : ప్లాట్ నెం.64, ఉత్తరం : రోడ్డు.

ఈ ప్రకటన ద్వారా తెలియజేయనది ఏమనగా, సదరు రిజిష్టర్డ్ దస్తావేజులు ఎవరికైననూ దొరికిన యెడల ఈ క్రింది చిరునామాకు ఏడు (7) దినములలోగా ఇవ్వగలరు. అట్లు కానియెడల సదరు ఆస్తి మీద ఎటువంటి అక్షేపణలు ఎవరికీ లేవని నమ్మగలము.

యస్. వాణాజీ, M.Sc., LLB; అడ్వకేట్
డో.నెం.49-48-19, NGGO's కాలనీ,
అక్కయ్యపాలెం, విశాఖపట్నం-16.
విశాఖపట్నం
తేది : 11.10.2024 ఫోన్ : 80740 46019

కోరలు చాస్తున్న కాలుష్యం..

- పది గ్రామాలలో భూగర్భ జలాలు కలుషితం
- తాగునీటికి తప్పని ఇక్కట్లు



కందివలసగెడ్డలో కలుషితమైన నీరు

పూసపాటిరేగ: జిల్లా సరిహద్దు గ్రామాలలో కాలుష్యం కోరలు చాస్తోంది. రసాయన పరిశ్రమల నుంచి వెలువడుతున్న వ్యర్థ జలాలతో భూగర్భ జలాలు కలుషితమై సుమారు 10 గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామాలలో బోర్లు, నేల బావుల నీరు కలుషితం కావడంతో నిరుపయోగంగా మారుతున్నాయి. ఆయా గ్రామాలను ఆనుకుని ఉన్న కందివలసగెడ్డలోకి పరిశ్రమ వ్యర్థజలాలు వదలడంతో గెడ్డ కూడా కలుషితమైంది. దీంతో గెడ్డ నీరు తాగి ఎన్నో పశువులు మృత్యువాత పడుతున్నాయి. విజయనగరం జిల్లా సరిహద్దులలో ప్రవహిస్తున్న కందివలస గెడ్డను ఆనుకుని పూసపాటిరేగ మండలంలో పలు గ్రామాలున్నాయి. వాటిలో అల్లాడపాలెం, చౌడువాడ, కోనయ్యపాలెం, కొణతాలపాలెం, కనిమెల్ల, కామవరం, చింతపల్లి, కృష్ణాపురం, నీలగెడ్డపేట, లంకలపల్లిపాలెం, తదితర గ్రామాల్లోని సాగునీటి వనరుల్లోకి పరిశ్రమల వ్యర్థాలు కలిసిపోతుండడంతో నీరు కలుషితమవుతోంది. ప్రజలు రోగాల బారిన పడుతున్నా.. పశువులు మృత్యువాత పడుతున్నా కాలుష్య నియంత్రణ బోర్డు అధికారుల జాడ లేదు. జిల్లాకు శివారున ఉన్న గెడ్డలోకి రాత్రివేళల్లో పరిశ్రమల నుంచి వచ్చే వ్యర్థాలను విడిచిపెడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు దృష్టి సారించి, ప్రజలను కాలుష్యం బారి నుంచి కాపాడాలని పలువురు కోరుతున్నారు.

చర్యలు తీసుకోవాలి..

గెడ్డలో వ్యర్థ జలాలను పరిశీలించి పీసీబీ అధికారులు చర్యలు తీసుకోవాలి. కాలుష్యం కోరలు చాస్తున్నా కాలుష్య నియంత్రణ మండలి అధికారులు స్పందించడం లేదు. పరిశ్రమలు శ్రీకాకుళం జిల్లా సరిహద్దులో ఉంటే కాలుష్య కారకాలు మాత్రం విజయనగరం జిల్లా పరిధిలోకి రావడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.

– ఎం. శ్రీనివాసరావు, పూసపాటిరేగ

ఇబ్బంది పడుతున్నాం..

కందివలస గెడ్డ కలుషితం కావడంతో ఇబ్బందులు తప్పడం లేదు. గెడ్డలో నీరు తాగిన పశువులు మృత్యువాత పడుతున్నాయి. పరిశ్రమల పైపైల నుంచి వ్యర్థాలను గెడ్డలోకి వదిలేస్తున్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి వాస్తవాలు తెలుసుకుని, పరిశ్రమ యజమానులపై చర్యలు తీసుకోవాలి.

బి. సూర్యనారాయణ, పూసపాటిరేగ

ఘటాల ఊరేగింపు

విజయనగరం టౌన్: కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి పైడితల్లి మండల దీక్ష చేపట్టిన భక్తులు పైడిమాంబ దీక్షా ఆది పీఠం ఆధ్వర్యంలో శుక్రవారం ఘటాలతో భారీ ఊరేగింపు నిర్వహించారు. పైడితల్లి ఆలయ ఈఓ డీవీవీ ప్రసాదరావు పర్యవేక్షణలో పీఠంలో పూజాధికాలు నిర్వహించిన అనంతరం ఊరేగింపు ప్రారంభించారు. శివాలయం వీధి, పార్కుగేట్ జంక్షన్, కమ్మవీధి, దుర్గాలమ్మ వేపచెట్టు, దుర్గమ్మ సన్నిధి నుంచి అంబటిసత్రం మీదుగా మూడులాంతర్లు చదురుగుడి వద్ద ఊరేగింపు చేరింది. ఈ సందర్భంగా అమ్మవారికి ఘటాలను చూపించి ఆలయం వెనుక ఉన్న వేప, రావి చెట్ల వద్ద సమర్పించారు. కార్యక్రమంలో దీక్షాపీఠం వ్యవస్థాపకుడు ఆర్.సూర్యపాత్రో, ఎస్. అచ్చిరెడ్డి, సిరిమాను అధిరోహకులు బంటుపల్లి వెంకటరావు, సుమారు వందమంది అమ్మవారి దీక్షాపరులు పాల్గొన్నారు.